


ఆర్ఎన్ఐ/2009/ 28733

స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 40 తిరుపతి తేది : శనివారం 09 మే 2026 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS

# నేడు తమిళనాడు సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకారం..?

- తమిళనాడు ప్రభుత్వ ఏర్పాటుపై వీడిన ఉత్కంఠ
- గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్ ప్రతిపాదన
- అవసరమైన ఎమ్మెల్యేల మద్దతు ఉన్నట్లు వెల్లడి
- మద్దతిచ్చిన వామపక్ష పార్టీలకు కృతజ్ఞతలు తెలిపిన విజయ్

అమరావతి -ఆంధ్రనాడు, మే 08



తమిళనాడు రాజకీయాల్లో కొన్ని రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. నటుడి నుంచి రాజకీయ నేతగా మారిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ముఖ్యమంత్రి పీఠం ఎక్కేందుకు మార్గం సుగమమైంది. చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో నేడుఉదయం 11 గంటలకు ఆయన సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు తెలుస్తోంది. శుక్రవారం సాయంత్రం విజయ్ లోక్ భవన్‌కు వెళ్లి గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన ఎమ్మెల్యేల మద్దతు తమకుందని గవర్నర్‌కు వివరించారు. ఈ మేరకు ఆయా పార్టీల మద్దతు లేఖలను గవర్నర్ కు అందించారు. అంతకుముందు విజయ్ చేసిన విజ్ఞప్తులను, తగిన సంఖ్యాబలం లేదనే కారణంతో గవర్నర్ తిరస్కరించిన విషయం తెలిసిందే. విజయ్‌ను అధికారానికి దూరం చేసేందుకు, దశాబ్దాల వైరం

- మిగతా 2లో..

## ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం...

- ముగ్గురి మృతి - దుకోనో అగ్నిపర్వతం ఉగ్రరూపం
- 10 కిలోమీటర్ల ఎత్తుకు ఎగిసిన బూడిద
- చిక్కుకుపోయిన 20 మంది పర్వతారోహకుల తరలింపు
- 4 కిలోమీటర్ల పరిధిలో కార్యకలాపాలు నిషేధం

అమరావతి -ఆంధ్రనాడు, మే 08




ఇండోనేషియాలో మరోసారి అగ్నిపర్వతం బద్దలైంది. నార్త్ మలుకు ప్రావిన్స్‌లోని దుకోనో అగ్ని పర్వతం శుక్రవారం ఉదయం విస్ఫోటనం చెందింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక పోలీసులు ధ్రువీకరించారు. పర్వతంపై చిక్కుకుపోయిన సుమారు 20 మంది పర్వతారోహకులను సురక్షితంగా తరలించేందుకు

- మిగతా 2లో..

## ‘రాయలసీమ ఇక రాయల్ సీమ’..

- సీఎం చంద్రబాబు ఆసక్తికర పోస్ట్
- ఏపీకి రానున్న ప్రముఖ బైక్ తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్
- తిరుపతి జిల్లా సత్యవేడులో రూ. 2,200 కోట్ల పెట్టుబడి
- ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 5,000 మందికి ఉపాధి అవకాశాలు

అమరావతి -ఆంధ్రనాడు, మే 08



ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ ఏపీలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. తిరుపతి జిల్లాలో సుమారు రూ. 2,200 కోట్ల వ్యయంతో మోటార్‌సైకిళ్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం ఈ ప్రాజెక్టుకు ఆమోదముద్ర వేసింది. ఈ శుభవార్తను సీఎం చంద్రబాబు తనదైన శైలిలో సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. “రాయల్ ఎన్‌ఫీల్డ్ రాయలసీమలోకి

- మిగతా 2లో..

## అంతర్జాతీయ విద్యాభ్యాసానికి పావలా వడ్డీకే రుణాలు...



- విద్యార్థులకు అండగా చంద్రబాబు ప్రభుత్వం
- జాతీయ, అంతర్జాతీయ విద్యకు పావలా వడ్డీకే రుణాలు
- కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు
- ఆగస్టు 15 నాటికి 2.5 లక్షల ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు
- బుడగజంగాలకు ఎస్సీలకు వర్తించే అన్ని ప్రయోజనాలు వర్తింపు
- సూపర్ సిక్స్, ఇతర సంక్షేమ పథకాల అమలుపై సీఎం సమీక్ష



అమరావతి -ఆంధ్రనాడు, మే 08

ఆంధ్రప్రదేశ్‌లోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన విద్యాసంస్థల్లో చదువుకునేందుకు వీలుగా పావలా వడ్డీ (25 పైసల వడ్డీ)కే విద్యా రుణాలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఏడవ జిల్లా కలెక్టర్ల సమావేశంలో భాగంగా సంక్షేమ పథకాలపై సమీక్ష సందర్భంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు.

- మిగతా 2లో..

## పౌష్టికాహారం పంపిణీలో ఏ-ప్లస్ గ్రేడ్

- మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్య కూమారి

అమరావతి -ఆంధ్రనాడు, మే 08



రాష్ట్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో 96.22 శాతం, చిన్నారులకు 97.29 శాతం లక్ష్యాన్ని చేరుకుని ఎ-ప్లస్ గ్రేడ్ సాధించిందని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి ఎ సూర్యకూమారి వెల్లడించారు. కలెక్టర్ల సదస్సులో రెండవ రోజైన శుక్రవారం ఆమె మహిళాభివృద్ధి, శిశు సంక్షేమానికి చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవలపై ప్రత్యేకంగా దృష్టి సారించామనానరు. పాలు, గుడ్లు, బాలామృతం వంటి పోషకాహార పదార్థాలను సమయానికి సరఫరా చేయడం, నిరంతర పర్యవేక్షణ చేపట్టడం వల్ల ఐదేళ్లలోపు పిల్లల్లో

- మిగతా 2లో..

## పాలనలో ఆ రెండు చాలా ముఖ్యం

- 7వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో చంద్రబాబు
- పాలనలో టెక్నాలజీ, మానవీయత రెండూ ముఖ్యమన్న సీఎం చంద్రబాబు
- ప్రతీ శుక్రవారం నియోజకవర్గాల్లో ‘ఫీల్డ్ గ్రీవెన్స్ డే’ నిర్వహణ
- ఫైళ్ల క్లియరెన్స్‌ను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం
- అర్జీల పరిష్కారంలో ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ తెచ్చుకోవాలని సూచన
- 90 రోజుల్లో అన్ని శాఖల కేపీఐలతో డ్యాష్ బోర్డు ఏర్పాటుకు సన్నాహాలు

అమరావతి -ఆంధ్రనాడు, మే 08



“పాలనలో అత్యాధునిక టెక్నాలజీని వినియోగించుకోవడం ఎంత ముఖ్యమో, అదే సమయంలో మానవీయ కోణంతో ఆలోచించి ప్రజలకు సేవలు అందించడం కూడా అంతే ముఖ్యం” అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కేవలం సాంకేతికతపైనే ఆధారపడి యాంత్రికంగా కాకుండా, ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, వారి పట్ల కరుణతో స్పందించాలని అధికారులకు ఆయన హితవు పలికారు. శుక్రవారం జరిగిన 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రెండో రోజు ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పాలనా వ్యవస్థలో వేగం, పారదర్శకతతో పాటు మానవతా విలువలకు పెద్దపీట వేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఫైళ్ల క్లియరెన్స్, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం (పీజీఆర్ఎస్),

- మిగతా 2లో..

## 12 నుండి ఏపీ ఈఏపీ సెట్ 2026 పరీక్షలు

-- నిమిషం ఆలస్యమైన పరీక్షకు గైర్హాజరే

-- జూన్ 1న ఫలితాలు

-- ఏపిఈఏపీ సెట్ చైర్మన్ ప్రసాద్ వెల్లడి

## 2,106 ఆవాసాల్లో తాగునీటి సమస్య

- పరిష్కారానికి రూ.40.47 కోట్లతో ప్రణాళిక

- పిఆర్ అండ్ ఆర్‌డి ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్

## ఇ-ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు ముందంజ

2లో

# నేడు తమిళనాడు సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకారం..?

(మొదటి పేజీ తరువాయి)

మరచి డీఎంకే, అన్నాడీఎంకే ఏకమవుతాయనే ప్రచారం జోరుగా సాగింది. అయితే, తాజా పరిణామాలతో ఆ ఊహాగానాలకు తెరపడింది. ఈ క్రమంలో గవర్నర్ తో భేటీ ముగిసిన అనంతరం విజయ్, తమకు మద్దతు తెలిపిన సీపీఐ, సీపీఎం కార్యాలయాలకు వెళ్లి వామపక్ష నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ప్రభుత్వ ఏర్పాటు విషయంలో రాజ్యాంగ సంక్షోభం ఏర్పడడంతో టీవీకే నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారంటూ వార్తలు వచ్చాయి. అయితే టీవీకే వర్గాలు ఆ వార్తలను ఖండించాయి. తాము సుప్రీంకోర్టుకు వెళ్లామనడంలో నిజంలేదని స్పష్టం చేశాయి.

# ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం...

(మొదటి పేజీ తరువాయి)

సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 7:40 గంటలకు ఈ విస్ఫోటనం సంభవించింది. దీని ప్రభావంతో సుమారు 10 కిలోమీటర్ల ఎత్తు వరకు దట్టమైన బూడిద మేఘాలు ఆకాశంలోకి ఎగిసిపడ్డాయి. అగ్నిపర్వత బిలం నుంచి 4 కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టవద్దని అధికారులు ప్రజలను హెచ్చరించారు. వర్షాలు కురిస్తే అగ్నిపర్వత బురద ప్రవాహాలు (మడ్‌ఫ్లోస్) సంభవించే ప్రమాదం ఉందని కూడా హెచ్చరికలు జారీ చేశారు. దుకోనో అగ్నిపర్వతం ఈ ఏడాది ఫిబ్రవరిలో కూడా విస్ఫోటనం చెందింది. ఆ సమయంలో విమానయాన రంగానికి అధికారులు ఆరెంజ్ లెవెల్ హెచ్చరిక జారీ చేశారు. బూడిద కారణంగా శ్వాసకోశ సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రజలు మాస్కులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సముద్ర మట్టానికి 1,087 మీటర్ల ఎత్తులో ఉన్న దుకోనో, ఇండోనేషియాలోని 127 క్రియాశీల అగ్నిపర్వతాలలో ఒకటి. గత నెలలో ఇండోనేషియాలోని మౌంట్ సెమేరు అగ్నిపర్వతం కూడా పలుమార్లు విస్ఫోటనం చెందిన విషయం తెలిసిందే.

# 'రాయలసీమ ఇక రాయల్ సీమ'..

(మొదటి పేజీ తరువాయి)

దూసుకుపోతోంది! రాయలసీమ ఇప్పుడు రాయల్ సీమ" అనే క్యాప్షన్‌తో ఓ బుల్లెట్ బైక్ ఫొటోను ఆయన పంచుకున్నారు. ఈ ట్వీట్ కొద్దిసేపట్లోనే వైరల్‌గా మారింది. తిరుపతి జిల్లా సత్యవేడు మండలంలోని వన్నెలూరు, రాళ్ళకుప్పం గ్రామాల్లో ఈ పరిశ్రమ కోసం ప్రభుత్వం 267 ఎకరాల భూమిని కేటాయించింది. రెండు దశల్లో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మొదటి దశను 2029 నాటికి, రెండో దశను 2032 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# పౌష్టికాహారం పంపిణీలో ఏ-ప్లస్ గ్రేడ్

(మొదటి పేజీ తరువాయి)

ఎదుగుదల లోపం, తక్కువ బరువు సమస్యలు గణనీయంగా తగ్గాయని పేర్కొన్నారు. 'పోషణ్ ట్రాకర్'లో వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని కలెక్టర్లకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను కేవలం పౌష్టికాహార కేంద్రాలుగానే కాకుండా చిన్నారులకు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించే ప్రీ-స్కూళ్లుగా తీర్చి దిద్దుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో మంజూరైన 13,916 మరుగుదొడ్లలో ఇప్పటికే 9,209 నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. 15,521 తాగునీటి కనెక్షన్లలో 12,131 కేంద్రాల్లో పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయడంతో పాటు విద్యుత్ సదుపాయం లేని కేంద్రాలకు వెంటనే విద్యుదీకరణ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

**అంగన్‌వాడీ భవనాలకు స్థలాలు**

అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీలకు సొంత భవనాల నిర్మాణం కోసం స్థలాలు కేటాయించాలని సూచించారు. ఇప్పటికే 8,809 అంగన్‌వాడీ కేంద్రాలను సమీప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోకి మార్చామని, ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి జన్మన్ పథకం కింద గిరిజన ప్రాంతాల్లో మంజూరైన 192 అంగన్‌వాడీ కేంద్రాల్లో 156 భవనాల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. అలాగే 365 మినీ అంగన్‌వాడీలను ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం ప్రీ-స్కూల్ హాజరు శాతం 89గా ఉందని, దాన్ని 90 శాతానికి పైగా పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీలో చేర్పించేలా ఇంటింటి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 641 అంగన్‌వాడీ కార్యకర్తలు, 131 మినీ కార్యకర్తలు, 5,325 సహాయకుల పోస్టుల భర్తీ ప్రక్రియను మే 2026 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిస్థాయి విజయం సాధించిందని తెలిపారు. కౌమార దశ బాలికల్లో అవగాహన పెంచేందుకు మే ఒకటి నుంచి జూన్ 10 వరకు 'కిశోరి వికాసం' ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# ఇ-ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు ముందంజ

**అమరావతి -ఆంధ్రనాడు, మే 08**



రాష్ట్రంలో ఇ-ఫైళ్ల పరిష్కారంలో వ్యవసాయశాఖ మంత్రి కె, అచ్చెన్నాయుడు మిగిలిన మంత్రులకంటే ముందంజలో ఉన్నారు. కలెక్టర్ల సమావేశంలో శుక్రవారం ఈ విషయం చర్చకు వచ్చింది. ఐటి శాఖ ముఖ్య కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఈ విషయాన్ని ప్రస్తావించారు. గతంలో ఇ-ఫైళ్ల క్లియరెన్స్‌కు సుమారు ఐదు గంటల సమయం పట్టేదని, ప్రస్తుతం భారీ స్థాయిలో ఫైళ్లు వచ్చినప్పటికీ సరాసరి కేవలం 2 గంటల 49 నిమిషాల్లోనే ఫైళ్లను డిస్పోజ్ చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ వేగవంతమైన నిర్ణయం వల్ల మరింత సమర్థవంతంగా ప్రజాసేవలను అందించవచ్చని చెప్పారు. ఇ-ఫైళ్ల క్లియరెన్స్‌ను రోజుల వ్యవధి నుంచి గంటల వ్యవధిలోకి తీసుకురావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు.

# అంతర్జాతీయ విద్యాభ్యాసానికి పావలా వడ్డీకే రుణాలు...

(మొదటి పేజీ తరువాయి)

ఈ నిర్ణయంతో ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ వంటి జాతీయ సంస్థలతో పాటు విదేశాల్లోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీలలో చదవాలనే విద్యార్థుల కలలు సాకారం కానున్నాయి. కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలని, వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ప్రఖ్యాత సంస్థల్లో సీట్లు సాధించేలా చూడాలని సూచించారు. విదేశాల్లో ఉద్యోగాలు సాధించేందుకు వీలుగా ఎస్సీ, ఎస్టీ యువతకు జర్మన్ భాషలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని, యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించి, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం ద్వారా వారి జీవన ప్రమాణాలను పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు.

**సంక్షేమ పథకాలపై సమీక్ష, కీలక ఆదేశాలు**

సూపర్ సిక్స్ పథకాల అమలు, లబ్ధిదారుల ఇంటిగ్రేషన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు విస్తృతంగా సమీక్షించారు. 'తల్లికి వందనం' ద్వారా 67 లక్షల మందికి రూ.10 వేల కోట్లు అందిస్తున్నామని, 'స్త్రీశక్తి' పథకం కింద మహిళలు ఇప్పటివరకు 60.6 కోట్ల ప్రయాణాలు చేశారని, దీనికోసం ప్రభుత్వం ఏటా రూ.1940 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. 'దీపం 2.0' కింద 1.08 కోట్ల మంది లబ్ధిదారులకు రూ.3504 కోట్లు అందజేశామన్నారు. మే 19న మత్స్యకారుల కోసం రూ.286 కోట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

**బుడగజంగాలకు ఎస్సీ ప్రయోజనాలు**

సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. బుడగజంగాలను ఎస్సీలలో చేర్చాలన్న డిమాండ్‌పై కేంద్రంతో చర్చిస్తామని, కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలోపు ఉద్యోగాలు మినహా ఎస్సీలకు వర్తించే అన్ని సంక్షేమ ప్రయోజనాలను వారికి వర్తింపజేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇది వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది.

**పేదల సొంతింటి కల సాకారం**

రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోందని సీఎం తెలిపారు. ఆగస్టు 15 నాటికి 2.50 లక్షల ఇళ్లకు, డిసెంబర్ నాటికి మరో 2.38 లక్షల ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించారు. 2027 డిసెంబర్ నాటికి మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, కొండ ప్రాంతాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించాలని, దీనివల్ల ఒక్క విజయవాడలోనే 60 వేల మందికి, విశాఖలో 30 వేల మందికి లబ్ధి చేకూరుతుందని అన్నారు.

**పరిపాలనలో పారదర్శకత, వేగం**

ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేలా అధికారులు పనిచేయాలని సీఎం సూచించారు. ముఖ్యంగా విద్య, వైద్యం, విద్యుత్ ఖర్చులు తగ్గించేలా చొరవ చూపాలన్నారు. భూవివాదాలను పరిష్కరించడంలో భాగంగా వచ్చే కలెక్టర్ల సమావేశం నాటికి 22ఏ కింద ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 2027 మార్చి నాటికి భూ రీసర్వే ప్రక్రియ పూర్తి చేసి, పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ల సమావేశాలు, సమీక్షలు కేవలం ప్రజల సంక్షేమం కోసమేనని, ప్రతి అధికారి ఈ విషయాన్ని గుర్తుంచు కుని పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

# పాలనలో ఆ రెండు చాలా ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

టెక్నాలజీ వినియోగం వంటి పలు కీలక అంశాలపై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు.

**అర్జీల పరిష్కారంలో బ్రాండ్ ఇమేజ్ రావాలి**

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో రాష్ట్రం ఒక ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్‌ను సంపాదించుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కొందరు అధికారులు అర్జీలను తీసుకుని కార్లలో పడేస్తున్నారనే ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని, ఇలాంటి అలసత్వం పునరావృతం కావొద్దని గట్టిగా హెచ్చరించారు. "ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి. కాగితాలు తీసుకుని పక్కన పడేయడం కాదు, సమస్య పరిష్కారమైతేనే ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుంది" అని అన్నారు. ఇందుకు అనుగుణంగా 'ప్రజా దర్బార్' వంటి ఒక ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సింగపూర్ తరహాలో ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి కూర్చుని అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించే విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. దీనిలో భాగంగా, ప్రతి సోమవారం కలెక్టరేట్లలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే మాదిరిగానే, ఇకపై ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో 'ఫీల్డ్ గ్రీవెన్స్ డే' నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టర్లు 'గుడ్ విల్ మిషన్' గా క్షేత్రస్థాయికి వెళ్లి, ప్రతి నెలా ఒక నియోజకవర్గాన్ని నాలుగు సార్లు సందర్శించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

**ఫైళ్ల క్లియరెన్స్‌లో సత్వర స్పందన**

ప్రభుత్వ సేవలు ప్రజలకు వేగంగా అందాలంటే ఫైళ్ల క్లియరెన్స్ అత్యంత కీలకమని చంద్రబాబు పేర్కొన్నారు. గత మూడు నెలలతో పోలిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఫైళ్ల క్లియరెన్స్ సగటు సమయం 10 రోజుల నుంచి 2 రోజులకు తగ్గడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పెద్దమొత్తంలో ఫైళ్లు వచ్చినా, సగటున 10 గంటల వ్యవధిలోనే డిస్పోజ్ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

ఇదే స్ఫూర్తిని మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు, ఎస్పీలు కొనసాగించాలని, 24 గంటల్లోపు ఇ-ఫైల్స్ పరిష్కరించేలా శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. పనితీరులో వెనుకబడిన అధికారులు వేగం పెంచుకోవాలని స్పష్టం చేశారు. ఇకపై మాన్యువల్ ఫైళ్లకు స్వస్తి పలికి, జిల్లా స్థాయి నుంచి హెచ్ఓడీల వరకు తప్పనిసరిగా ఇ-ఫైల్స్ మాత్రమే జనరేట్ చేయాలని ఆదేశించారు.

**ఆన్‌లైన్ సేవలతో అవినీతికి చెక్**

ప్రజలు తమ పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని వృథా చేసుకోకూడదని ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వ సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సమయం ఆదా అవ్వడంతో పాటు, అవినీతికి కూడా అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. 'వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర' ద్వారా ఇప్పటికే 29 లక్షల మందికి శిక్షణ ఇచ్చామని, డిసెంబరు నాటికి 100 శాతం ప్రభుత్వ సేవలను వాట్సాప్‌లో అందించేలా చూడాలని లక్ష్యం నిర్దేశించారు. స్మార్ట్ ఫోన్లు లేని 34 శాతం కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని, మాన్యువల్ టచ్ పాయింట్ల వద్ద వారికి వాట్సాప్ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. తుపాను, పిడుగుల వంటి ప్రకృతి వైపరీత్యాల హెచ్చరికలను నేరుగా ప్రజల మొబైళ్లకే పంపే వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో భాగంగా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ శాఖల పనితీరును, రోజువారీ లక్ష్యాలను ఒకే వేదికపై పర్యవేక్షించేందుకు వీలుగా ఒక సమగ్ర డ్యాష్‌బోర్డును రూపొందిస్తున్నామని తెలిపారు. రాబోయే 90 రోజుల్లో ఈ డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తెస్తామని సీఎంకు వివరించారు. ఈ సమావేశంలో పలువురు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# 12 నుండి ఏపీ ఈఏపీ సెట్ 2026 పరీక్షలు

**-- నిమిషం ఆలస్యమైన పరీక్షకు గైర్హాజరే**

**-- జూన్ 1న ఫలితాలు**

**-- ఏపిఈఏపీ సెట్ చైర్మన్ ప్రసాద్ వెల్లడి**



**కాకినాడ -ఆంధ్రనాడు, మే 08**

ఏపీ ఈ ఏపీ సెట్ 2026 పరీక్షలు ఈనెల 12, 13, 14, 15, 18 తేదీలలో ఇంజనీరింగ్ పరీక్షలు, 19, 20 తేదీలలో అగ్రికల్చర్ ఫార్మసీ స్ట్రీమ్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఏపీ ఈ ఏపీ 2026 చైర్మన్, జేఎన్టీయూకే విసి ప్రొఫెసర్ సిఎస్ఆర్ కె ప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షలకు ఇంజనీరింగ్ విభాగానికి రెండు లక్షల 75 వేల 784, అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 78,435 మందితో పాటు మొత్తం మూడు లక్షల 55 వేల 11మంది పైగా నమోదైనట్లు ప్రసాద్ తెలిపారు. శుక్రవారం జేఎన్టీయూలోని విసి చాంబర్లో విలేకరులతో సమావేశం నిర్వహించి ఏపీఈ ఏపీ సెట్ 2026 విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ప్రసాద్ మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు ఈ పరీక్షలను రాష్ట్రంలో 142 కేంద్రాల ద్వారా నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు పరీక్ష సమయానికి రెండు గంటల ముందే చేరుకోవాలని ఒక్క నిమిషం దాటిన లోనికి పరీక్ష రాసేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. 23వ తేదీన కీ విడుదల చేస్తామని అందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని స్వీకరించి నిపుణులతో చర్చించి దానికి సమాధానం అందిస్తామని చెప్పారు. వీలైనంతవరకు జూన్ ఒకటవ తేదీన పరీక్షా ఫలితాలను వెల్లడించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు విసి ప్రసాద్ చెప్పారు. ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎన్ మోహన్ రావు మాట్లాడుతూ ఏప్రిల్ 28వ తేదీ నుంచి విద్యార్థులకు అవసరమైన హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకునే అవకాశం ప్రభుత్వం వెబ్సైట్ల ద్వారా కలిపించిందన్నారు. పరీక్ష రాసే సెంటర్లో సీసీటీవీలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సమావేశంలో ఓఎస్డి డి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ పరీక్ష పూర్తి ఆన్లైన్లోనే నిర్వహిస్తున్నామని అందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని సూచించారు.

# 2,106 ఆవాసాల్లో తాగునీటి సమస్య

**- పరిష్కారానికి రూ.40.47 కోట్లతో ప్రణాళిక**

**- పిఆర్ అండ్ ఆర్‌డి ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్**

**అమరావతి -ఆంధ్రనాడు, మే 08**



రాష్ట్రంలోని 251 మండలాల్లోని 2,106 ఆవాసాల్లో తాగునీటి సమస్య ఉందని పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి సంస్థ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ తెలిపారు. ఈ ఆవాసాల్లో సమస్య పరిష్కారానికి రూ.40.47 కోట్లతో ప్రత్యేక కాంటింజెన్సీ ప్రణాళిక రూపొందిం చినట్లు చెప్పారు. ఇందులో కరువు ప్రభావిత 28 మండలాలకు రూ.4.94 కోట్లు, మిగిలిన 223 మండలాలకు రూ.35.53 కోట్లు కేటాయించినట్లు వివరించారు. కలెక్టర్ల సదస్సులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి సమస్యలపై తక్షణ స్పందన కోసం రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో డ్రౌట్ మానిటరింగ్ సెల్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిజిఆర్ఎస్ హెల్ప్‌లైన్, టోల్‌ఫ్రీ నెంబర్ 1,902 ద్వారా ప్రజా ఫిర్యాదులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. 'సమ్మర్ యాక్షన్ ప్లాన్--2026'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి సరఫరాను నిరంతరంగా కొనసాగించేలా కార్యాచరణ అమలు చేస్తున్నామని వెల్లడించారు. చివరి ప్రత్యామ్నాయంగా వ్యక్తికి రోజుకు కనీసం 15 లీటర్ల తాగునీరు అందేలా ట్యాంకర్ల ద్వారా సరఫరా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్నమయ్య జిల్లాలో ఇప్పటికే 101 నివాస ప్రాంతాలకు తాగునీటి రవాణాకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 5 మండలాల్లోని 30 ఆవాస ప్రాంతాలకు 1,439 ట్యాంకర్ ట్రిప్‌ల ద్వారా నీటి సరఫరా కొనసాగుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,539 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు అందుబాటులో ఉండగా, వాటిలో 89 శాతం ట్యాంకులు 75 నుంచి 100 శాతం వరకు నింపబడ్డాయని తెలిపారు. వీటిలో 65 శాతం ట్యాంకులు రెండు నెలలకు పైగా నీటి అవసరాలను తీర్చగల సామర్థ్యంతో ఉన్నాయని చెప్పారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి అదనపు నీటి విడుదల కోసం గుంటూరు జిల్లా, బాపట్ల జిల్లా, పల్నాడు జిల్లా అధికారులు సాగునీటి శాఖను అభ్యర్థించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 1.56 లక్షలకుపైగా చేతిపంపులు, 52 వేలకుపైగా సిగిల్ విలేజ్ స్కీం (ఎస్‌విఎస్), 512 సిపిడబ్ల్యుఎస్ పథకాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పనిచేయని 102 ఎస్‌విఎస్ పథకాల మరమ్మతులు గ్రామపంచాయతీ నిధులతో వారంలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. పైప్‌లైన్ లీకేజీల కారణంగా నీటి సరఫరా నిలిచిన 44 సిపిడబ్ల్యుఎస్ పథకాలున్న ఆవాసాలకు ప్రత్యామ్నాయ వనరుల ద్వారా నీరు అందిస్తున్నామని పేర్కొన్నారు.

## ఆరోగ్య శాఖ మంత్రికి సన్మానం



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 8 :** రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కు భారతీయ జనతా పార్టీ నాయకులు సాలు ఆ కప్పి సన్మానించారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సమంచి శ్రీనివాస్, రేణిగుంట మండల ఉపాధ్యక్షుడురాజ రాయల్. పట్టణ అధ్యక్షుడు నరేష్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## రేణిగుంటలో తాసిల్దార్ కు సన్మానం



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 8:** రేణిగుంట తహసిల్దార్ శ్యాం ప్రసాద్ కు మండల టిడిపి నాయకులు శుక్రవారం సన్మానించారు. రేణిగుంట తాహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసిల్దార్ శ్యాం ప్రసాద్‌ను తెలుగుదేశం పార్టీ రేణిగుంట మండల నాయకులు ఘనంగా సన్మానించారు. మండల పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారం, పరిపాలనలో ఎమ్మార్వో బాధ్యతలు తీసుకున్నప్పటినుంచి, కార్యచరణలో, చూపిస్తున్న పనితీరును టిడిపి నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు ముని చంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు సూరి రాయల్, నాయకులు తహసిల్దార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మండలంలోని భూ సమస్యలు, రేషన్ కార్డులు మరియు ఇతర ప్రభుత్వ సేవలు ప్రజలకు వేగంగా అందేలా చూడాలని కోరారు. తహసిల్దార్ స్పందిస్తూ నిబంధనల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని, మండల అభివృద్ధికి మరియు శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపిస్టేట్ లీగల్ సెల్ ఉదయ్ కుమార్ రెడ్డి, మోహన్ రావు,భాస్కర్ రెడ్డి, కొరియర్ రవి, రమేష్, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులుగా చలపతి





**కార్వేటినగరం – ఆంధ్రనాడు, మే 8 :** చిత్తూరు జిల్లా ఏపీటీఎఫ్ జిల్లా నూతన అధ్యక్షులుగా చలపతిరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు బాబు, వేణుగోపాలు తెలియజేశారు. చిత్తూరులోని మునిసిపల్ హై స్కూల్‌లో రాష్ట్ర అదనపు కార్యదర్శి చెంగల్రాయ మందడి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షులుగా కె చలపతిరావు, కార్యదర్శిగా గిరి, గౌరవ అధ్యక్షులుగా కిరణ్ అసోసియేట్ అధ్యక్షులుగా ద్వారకనాథ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా రుద్ర మూర్తి, గోవర్ధన్ శెట్టి, సురేంద్ర, కృష్ణమూర్తి, కార్యదర్శులుగా లక్ష్మీపతి, దినకరన్, లత, సురేష్ వరదరాజు, రెడ్డి వాణి, యుగంధి లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గతంలో పనిచేసినటువంటి జిల్లా నాయకులు కిరణ్, చిట్టిబాబు సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుర్రప్ప, ముని కృష్ణయ్య, రాజేంద్ర నాయుడు, త్యాగరాజు నాయుడు, పురుషోత్తం, శ్రీనివాసులు, బాబు, గుర్రప్పలు పాల్గొన్నారు.

## రేణిగుంట మండలంలో విద్యుత్ మరమత్తులు

**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 8:** రేణిగుంట మండలంలో విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోమే 9వ తేదీ రెండో శనివారం సందర్భంగా రేణిగుంట మండలంలో విద్యుత్ మరమ్మత్తులు చేపట్టినట్లు ట్రాన్స్ కో ఏడిఈ రమేష్ బాబు ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా రేణిగుంట, కరకంబాడి, ఎల మాంద్యం,గాజుల మన్యం, తూకివాకం, కురుకాలువ తదితర ప్రాంతాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మరమ్మత్తుల కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. దీంతో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఏడిఈ రమేష్ బాబు కోరారు.

# రేణిగుంటలో అవగాహన కార్యక్రమం

**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 8:** రేణిగుంట పట్టణంలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రేణిగుంట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి ఆదేశాల మేరకు మే1 నుండి 9 జూన్ 2026 వరకు జరుగుతున్న కిషోరి వికాసం కార్యక్రమంలో భాగంగా రేణిగుంట లోని వినాయక నగర్ మరియు పాంచాలి నగర్ లలో గల కిషోరి బాలికలకు రక్తహీనత (అనీమియా) నివారణ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నేటి కాలంలో చాలామంది రక్తహీనత అనీమియా తో బాధపడుతున్నారని, ఇది పురుషులతో పోలిస్తే స్త్రీలలోనే ఎక్కువగా కనిపిస్తుందని, శరీరంలో హెచ్ బి హీమోగ్లోబిన్ తక్కువగ తయారవడం వల్ల ఎర్ర రక్త కణాల సంఖ్య తగ్గడంతో రక్తహీనత (ఎనీమియా) సమస్య వస్తుందని హెల్త్ సూపర్వైజర్ కామరాజు వివరించారు. హిమోగ్లోబిన్ అనేది ఎర్ర రక్త కణాలలో కనిపించే ప్రోటీన్ అని,ఇది శరీరంలో ఎముక మజ్జలో తయారై, ఎర్ర రక్త కణాలకు రంగును ఇవ్వడమే కాక ఊపిరితిత్తుల నుంచి ఆక్సిజన్‌ను శరీరంలోని అన్ని అవయవాలకు తీసుకువెళ్తుందని అన్నారు. ఆడవారిలో సాధారణంగా ప్రతి 100 మిల్లీ లీటర్ల రక్తంలో 12 గ్రా,గర్భిణీ స్త్రీలలో 11 గ్రా, బాలింతలలో 12 గ్రా కన్నా రక్తం తగ్గితే వారు రక్త హీనతను కలిగి ఉన్నారని అర్ధమని వివరించారు. రక్తహీనత స్త్రీలలో ఎక్కువగా కనిపిస్తుందని, అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు ఏవరిలోనైనా ఈ సమస్య రావొచ్చని, దీని వల్ల శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థ దెబ్బతిని,అనారోగ్య సమస్యలు అనేకం దరిచేరుతాయని, ఆరోగ్యమైన ఎర్ర రక్త కణాల్ని శరీరం తయారు చేయలేకపోవడం జరుగుతోందన్నారు. ముఖ్యంగా స్త్రీలు



గర్భవతిగా ఉన్నప్పుడు మరియు బిడ్డకు పాలిచ్చేకాలం సరైన ఆహారం లేక రక్తహీనత ఉన్న వారు గుండె సంబంధింత వ్యాధులతో సైతం బాధపడుతుంటారని, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన చర్యలు స్త్రీలు గర్భవతిగా ఉన్నప్పుడు మరియు బిడ్డకు పాలిచ్చే సమయాల్లో మంచి పౌష్టిక, సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు రోజు వారి ఆహారంలో అన్ని రకాల పండ్లు, తాజా కూరగాయలు, పాలు, గ్రుడ్డు, మరియు ఆకు కూరలను తీసుకుంటూ ఉండాలని, మాంసాహారాన్ని తగిన మోతాదులో తీసుకోవడం వల్ల కూడా ఈ రక్తహీనత సమస్య బారిన పడకుండ ఉండవచ్చని సూచించారు. విటమిన్ సి ఉండే ఉసిరి కాయలు, సిట్రస్ పండ్లు, ఆరెంజ్, స్ట్రాబెర్రీ, టమోటలు, తీసుకోవాలని, ఖర్జూరం, బెల్లం, నల్ల నువ్వులు, వేరుశెనగ, తేనె, బాదం, జీడిపప్పులను తీసుకోవడం వల్ల కూడా రక్తహీనత సమస్య రాకుండా చూసుకోవచ్చునని రక్తహీనత సమస్యకు చికిత్స కంటే నివారణ ఒక్కటే ఉత్తమ మార్గశీ. అంతే కాకుండా వడదెబ్బ దాని పర్యవసానాల పై కూడా హాజరైన బాలబాలికలు, వారి తల్లి తండ్రులకు అవగాహన కల్పించారు. వేసవి ఎండ తీవ్రత వల్ల ప్రజలుమధ్యాహ్నం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎండ నేరుగా శరీరాన్ని తాకి శరీరాన్ని ప్రభావితం చేస్తుందని, సాధ్యమైనంత వరకు ఇంట్లోనే ఉండాలని పేర్కొన్నారు. వడదెబ్బ తగిలిన వారికి ఓ ఆర్ ఎస్ పాకెట్ ను ఒకలీటరు శుభ్రమైన త్రాగు నీటిలో కలిపి 24 గంటలలోగా తరచు త్రాగేలా చూడాలని కోరారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలోనూ ఓ ఆర్ ఎస్ కార్నర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం లు రేవతి, విజయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు మల్లీశ్వరి, అమ్ములు, ఆశాకార్యకర్తలు విజయలక్ష్మి, శ్రీదేవి, శాంతి, శివమ్మ, శివనాగలక్ష్మి, సులోచన, కళ్యాణి మరియు యుక్త వయస్సు బాలబాలికలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అమ్మవారి ఆస్తులను బహిరంగంగా ప్రకటిస్తాం

- భూదానానికి భక్తులు ముందుకు రావాలి
- ఆలయ అభివృద్ధి మన అందరి బాధ్యత
- ఆలయ చైర్మన్ రవిచంద్రబాబు

**కుప్పం – ఆంధ్రనాడు, మే 8:** కుప్పం గ్రామదేవత శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవం ముగిసిన మూడు నెలల్లో అమ్మవారి ఆదాయ, వ్యాయాలు ఆస్తుల వివరాలను పుస్తక రూపంలో ప్రచురిస్తామని రానున్న రోజుల్లో ఎవ్వరు చైర్మన్ గా ఉన్న ఇదేవిధంగా ప్రచూరించాలని శ్రీ తిరుపతి గంగమాంబ ఆలయ చైర్మన్ రవిచంద్రబాబు కోరారు. కుప్పంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరం అమ్మవారి జాతర పూర్తి చేసుకున్న అనంతరం తమ పాలకమండలి అమ్మవారి కి భక్తులు సమర్పించిన బంగారం, నగదు, భూదానానికి సంబంధించి పుస్తకాన్ని రూపొందించడం జరిగిందన్నారు. అమ్మవారికి భూదానం కార్యక్రమంలో భాగంగా రూ.9.90 కోట్లతో ఆస్తులను కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు చెప్పారు. వీటిలో రూ.84 లక్షలతో ఆలయం ఎదురుగా ఉన్న ఆస్తిని భూదానం కార్యక్రమంలో భాగంగా భక్తులు ఇచ్చిన విరాళాలతో రూ.63.32 లక్షలను కట్టినట్లు చెప్పారు. మిగులు రూ.25.38 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. కొనుగోలు



చేసిన స్థలం నుండి మరొక స్థలాన్ని కొనుగోలు చేయాల్సి ఉందని, 2016లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో ఆలయానికి 39 సెంట్ల భూమిని కేటాయించారన్నారు. సమీపంలోని మరో 1.43 సెంట్ల భూమిని కొనుగోలు చేసుకునేందుకు రూ.8.40 కోట్లతో అగ్రిమెంటు చేసుకున్నట్లు వివరించారు. ఈ ఆస్తులను కొనుగోలు చేసేందుకు ఇంకా రూ.9.90 కోట్లు వాటి యజమానులకు చెల్లించి, రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉందన్నారు. దాతలు ఇచ్చే ప్రతి రూపాయి అమ్మవారికి ఆస్తులను చేరుస్తున్నట్లు తెలిపారు. ఆలయానికి భక్తులు చెల్లించే కానుకలు, అమ్మవారికి వచ్చిన ఆస్తులను పుస్తకం ప్రచూరించి, విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసే ఆస్తుల ద్వారా ఆలయాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. రానున్న జాతరలో సైతం ప్రధానంగా భూదానానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. దేవాలయాలకు భూదానం ఒకప్పుడు రాజులు చేసేవారన్నారు. ద్రావిడ రాష్ట్రాల భక్తులు ఇష్టంగా పూజించే శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మకు భూదానం చేసే అవకాశం రావడం గొప్ప విషయమని, అమ్మవారి భక్తులు భూదానానికి ముందుకు వచ్చి భూదానం చేయాలని కోరారు. అమ్మవారి జాతరను భక్తుల సహకారంతో మరింత ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పాలక వర్గ సభ్యులు జయరాం, వినయ్, జ్యోతీష్, పవన్ మహేష్, కందస్వామి, నరేష్, శరవణ తదితరులు ఉన్నారు.

# 5 వ విడత దిశగా గొల్ల చీమనపల్లి పంచాయితీలో భూముల రీసర్వే

- గొల్ల చీమనపల్లి పంచాయితీలో జరుగుతున్న రీ సర్వే పనుల్ని పరిశీలించిన జిల్లా సర్వే శాఖ డీ డీ జయరాజ్
- భూములు సర్వే రైతుల సంక్షములోనే జరగాలి డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కృష్ణమూర్తి, రమణారెడ్డి

**బైరెడ్డిపల్లి – ఆంధ్రనాడు, మే 08:** భూముల రీ సర్వే రైతుల సమక్షంలోనే జరగాలని బైరెడ్డిపల్లి మండలం బాట పట్టిన జిల్లా సర్వే శాఖ డీ డీ జయ రాజ్ శుక్రవారం పేర్కొన్నారు. 5 వ విడత దిశగా గొల్ల చీమనపల్లి, లక్కనపల్లి, చప్పిడిపల్లి, పెద్ద చెల్లారాగుంట పంచాయితీ ల్లో చురుగ్గా రీ సర్వే జరుగుతున్నది. ఈ భూముల రీ సర్వేను సర్వే శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి. జయరాజ్ పరిశీలించారు. భూముల సర్వేకు ముందు నోటీసులు ఇస్తున్నారా లేదా సర్వే సక్రమంగా జరుగుతుందా అని రైతులను అడిగి తెలుసుకోన్నారు. పలు వివరాలపై ఆరా తీశారు ఈ కేవైసీ ఆప్ ద్వారా తప్పనిసరిగా చేయాలని గ్రామ సర్వేయర్లకు సూచించారు .వీఆర్వోలు, వీ ఆర్ ఏ లు సంబంధిత అధికారులు సర్వేలో కచ్చితంగా పాల్గొనాలని సూచించారు.ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ రైతులతో మాట్లాడుతూ భూముల యొక్క గట్లను హద్దులను ఖచ్చితముగా చూపించమని, రైతులు చూపిన గట్లు మేరకు రోవర్ సహాయముతో కోఆర్డినేట్స్ తీసుకుని రీ సర్వే క్వాలిటీగా జరుగుతుందని తెలిపారు. రైతులు సకాలంలో హాజరై తమ యొక్క అనుభవం ఉన్న స్థలం, గట్లు చూపిన యెడల త్వరితగతిన పూర్తి అవుతుందని తెలిపారు. లక్కనపల్లిలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూథింగ్ పను లను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గ్రామ సర్వేయర్లు మరియు మండల సర్వేయర్‌తో మాట్లాడుతూ టైం లిమి ట్ లోపల సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవి ధంగా గొల్ల చీమనపల్లె రైతులతో పబ్లిక్ పాసిటివ్ పర్సె ప్షన్ పై





ఐవిఆర్‌ఎస్ ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకొ న్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్, డి ప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కృష్ణమూర్తి, రమణరెడ్డి, సచి వాలయ సర్వేర్లు రాహుల్, ప్రతాప్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుదారులు 100 శాతం ఈకేవైసీ చేయాలి



**రామచంద్రాపురం – ఆంధ్రనాడు, మే 8:** మండలంలో వున్న రేషన్ కార్డుదారులందరూ రెండు రోజులలో సంబందిత డీలర్ల వద్ద ప్రతి ఒక్కరు ఈ కేవైసీ చేసుకోవాలని తహశీల్దార్ మధుసూదన్ రావు అన్నారు. రామచంద్రాపురం మండల తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం చౌకదుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాశీల్దారు మాట్లాడుతూ 11 రెవెన్యూ గ్రామాలలోని 31 చౌక దుకాణాలలో 28,052 రేషన్ కార్డులకు గాను 26,417 రేషన్ కార్డులకు ఈ కేవైసీ పూర్తయిందని, ఇంకనూ 721 మంది 5 సంవత్సరాలు లోపు వయసు కలిగిన వారు ఉన్నారని, 914 మంది ఇంకా ఈ కేవైసీ నమోదు చేసుకోలేదని వివరించారు. సివిల్ సప్లై డిటి యుగంధర్ మాట్లాడుతూ ఈకేవైసీ నమోదు చేసుకోని వారు రేషన్ డీలర్ల వద్దకు వెళ్లి వెంటనే చేసుకోవాలని కోరారు. ఈ కేవైసీని 100% పూర్తి చేయాలని డీలర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో డీలర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెదేపాలోకి 28 కుటుంబాల చేరిక....



**కుప్పం – ఆంధ్రనాడు, మే 08:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో 28 కుటుంబాలు శుక్రవారం ప్రభుత్వ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో చేరారు. స్థానిక సీనియర్ వైసీపీ నాయకులు ప్రభాకర్ సహా 28 కుటుంబాలు టిడిపిలో చేరారు. కడ పొలిటికల్ చైర్మన్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, పీకేఎం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కుటుంబాలను పార్టీలోకి ఆహ్వానించారు. కుప్పం నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయకత్వమే అవసరమని నమ్మి టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఎన్‌డీఏ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో కడ అడ్వైజరీ కమిటీ సభ్యుడు రాజ్ కుమార్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్, యూనిట్ ఇంచార్జ్ మణి, యూనిట్ ఇంచార్జ్ బాబు, కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమగల్, స్థానిక నాయకులు నబి, వేలు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## భక్తులను మంత్రముగ్ధులను చేసిన శ్రీవారి స్వర్ణరథోత్సవం





**చంద్రగిరి – ఆంధ్రనాడు, మే 8:** చంద్రగిరి మండలం, శ్రీనివాసమంగాపురంలో పూజలందుకుంటూవున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన స్వర్ణరథోత్సవంలో భక్తు పారవశ్యంలో మునిగి తేలారు. దివ్య కాంతులతో మెరిసిన స్వర్ణరథంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు అభయ కటాక్షాలు ప్రసాదించారు. "గోవిందా... గోవిందా..." నామస్మరణలతో మహి ళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగ డం విశేషంగా చెప్పవచ్చు. మంగళ వాయిద్యాలు, వేదఘోషలు, హారతులతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతా వరణం సంతరించుకున్నాయి. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను వసంత మండపానికి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు. మధ్యాహ్నం స్నపన తిరుమంజనంలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో పవిత్ర అభిషేకం నిర్వహించి స్వామివారికి విశేష సేవలు చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్, ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు, అర్చకుల బృందం, ఇంజనీరింగ్ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ నియామక పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే, మండల అధ్యక్షులు

- ప్రాథమిక విద్యాభివృద్ధి బాధ్యత అంగన్వాడిలదే.... ఎమ్మెల్యే అమర్
- ఎమ్మెల్యే చేతుల మీదుగా అంగన్‌వాడీలకు నియామక ఉత్తర్వుల పంపిణీ



**బైరెడ్డిపల్లి – ఆంధ్రనాడు, మే 08:** చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్యాభివృద్ధి బాధ్యత అంగన్‌వాడీ లదేనని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి ప్రాజెక్టు పరిధిలోని వి. కోట, బైరెడ్డిపల్లి మండలాలకు చెందిన ఒక అంగన్‌వాడీ వర్కర్, 32 మంది అంగన్‌వాడీ సహాయకులకు పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం నియామక ఉత్తర్వులను ఆయన పంపిణి చేశారు. ఈ ఏడాది జనవరిలో అంగన్‌వాడీ వర్కర్, 41 సహాయకుల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కాగా మార్చి నెలలో జరిగిన ఇంటర్వ్యూలలో ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళల సాధికారతకు అంగన్‌వాడీ వ్యవస్థ ఎంతో ముఖ్యమని తెలిపారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్యాభివృద్ధిలో అంగన్‌వాడీ కార్యకర్తల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా నియామక ప్రక్రియను నిర్వహించి అర్హులైన వారికి అవకాశాలు కల్పించిందన్నారు. నియామక ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం మరియు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపివో అరుణశ్రీ, సూపర్వైజర్లు లత, స్వర్ణలత, మాధవిలతతో పాటు రాష్ట్ర వేర్ హౌస్ కమిటీ సభ్యులు రంగనాథ్, స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కిషోర్ గౌడ్, రాంబాబు నాయకులు ఈశ్వర్ గౌడ్, హరి, మంజునాథ్ మరియు పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతో అంటువ్యాధులను అరికట్టవచ్చు: డాక్టర్ నిర్మల్ అలెగ్జాండర్



**రామచంద్రాపురం – ఆంధ్రనాడు, మే 8 :** పరిశుభ్రత పాటిస్తే అంటూ వ్యాధులను అరికట్టవచ్చునని కడప ప్రాంతీయ సంయుక్త మలేరియా ఆఫీసర్ డాక్టర్ నిర్మల్ అలెగ్జాండర్ అన్నారు. రామచంద్రా పురం మండలంలోని సి. రామాపురం పంచాయతీ, ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం నిర్వహిస్తూ వుండిన ఫ్రైడే – డ్రై డే కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు డ్రై డే ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే కీటక జనిత వ్యాధులు తరిమికొట్టొచ్చన్నారు. ప్రజలు డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించారు, ప్రతి శుక్రవారం అన్ని గ్రామాల్లో ఫ్రైడే – డ్రైడే నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. వేసవిలో ప్రజలు వడదెబ్బకు వైద్య ఆరోగ్య సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం కాలనీలో ఇంటింటికి వెళ్లి పరిశుభ్రతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి జి మోహన్ బాబు, ఎంపిహెచ్‌ఓలు నిత్యపూజయ్య, రమేష్‌బాబు, పర్యవేక్షకులు సుబ్రహ్మణ్యం, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# బైరెడ్డిపల్లి మండలంలో ఊసే లేని ఉద్యాన శాఖ

- ఇంతటికి మండలంలో ఉద్యాన శాఖ ఉన్నదా లేదా అని ఆలోచనలో పడ్డ రైతన్నలు
- అకాల వర్షంతో దెబ్బతిన్న ఉద్యాన పంటలను పరిశీలించిన పాపం కరువైంది



**బైరెడ్డి పల్లి – ఆంధ్రనాడు, మే 09:** మండలంలో ఎక్కువ మంది రైతన్నలు పండ్ల తోటలు, కూరగాయలు, పూల సాగు వంటి లాభదాయక పంటలను సాగు చేస్తున్నారు. వీటితోనే మంచి లాభదాయకం చేస్తూ ముందుకు రాణిస్తున్నారు. సాగులో ముందుకు వస్తున్న రైతన్నలు ప్రస్తుతం ఆలోచనలో పడ్డారు..అకాల వర్షం వల్ల పండ్ల తోటలు, కూరగాయలు, పూలు వంటి పంటలు దెబ్బతిన్నాయి, వాటి దిగుబడి, పంటలకు వచ్చే తెగుళ్ళు,సశ్య రక్షణ వంటి వాటిపై ఉద్యాన శాఖ అధికారి, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతన్నల గోడను కూడా పట్టించుకొన్న పాపన పోలేదని రైతన్నలు మండి పడుతున్నారు. కనీసం గ్రామాల్లో ఉద్యానశాఖ అధికారి పేరు కూడా ఇప్పటికి తెలియని రైతన్నలు మండలంలో కొకల్లంగా ఉన్నామని చర్చించుకొంటున్నారు. కనీసం రైతన్నలు ఏ పంటలు వేశారు..??? ఈ సీజన్ లో ఏ పంటలు వేసుకోవాలి..??? ఏ పంట వేస్తే లాభదాయకం ...?? అని గ్రామాల్లో రైతు సమావేశం ఏర్పాటు చేసి అవగహన చేసిన పాపన పోలేదని రైతన్నలు తీవ్ర ఆవేదనకు గురౌతున్నారు. ఉద్యాన పంటలు ప్రకృతి వైపరీత్యాలు వల్ల నష్టం చేకూరుతుంటే సంబంధిత అధికారులు కంట పడకపోవడశీతో రైతన్నలు మండలంలో ఈ శాఖ ఉన్నదా లేదా..?? ఒక వేళా ఉంటే కార్యాలయంలో కుర్చీలకే పరిమితమా...??? అంటూ మండలంలో రైతన్నలు చర్చించుకొంటున్నారు.

# తిరుమలలో భక్తులకు టీటీడీ విస్తృత వసతి సౌకర్యాలు



**తిరుమల – ఆంధ్రనాడు, మే 8 :** కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు ప్రతిరోజూ ప్రపంచ నలుమూలల నుండి వేలాది మంది భక్తులు తిరుమలకు విచ్చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం విస్తృత స్థాయిలో వసతి, విశ్రాంతి, లాకర్, స్నాన, అన్నప్రసాదం తదితర సదుపాయాలను కల్పిస్తోంది.భక్తులు దర్శనానికి ముందు స్నానమాచరించి పవిత్రంగా స్వామివారి దర్శనానికి వెళ్లడం ఆనవాయితీ కావడంతో, భక్తుల ఆచారాలు, మనోభావాలను దృష్టిలో ఉంచుకుని తిరుమల, తిరుపతిలో అనేక వసతి గదులు యాత్రికుల వసతి సముదాయాలను టీటీడీ నిర్మించింది.

**గదుల కేటాయింపు విధానం**

తిరుమలలో వసతి గదులు పొందదలచిన భక్తులు సీ ఆర్వో జనరల్ కౌంటరులో ఆధార్ కార్డు, ఫోన్ నంబరు తదితర వివరాలను నమోదు చేసుకోవాలి. అనంతరం కేటాయించబడిన గది నంబరు, ఆ ప్రాంత వివరాలు ఎస్ఎంఎస్ ద్వారా భక్తులకు పంపబడతాయి.భక్తులు సంబంధిత ఉప విచారణ కార్యాలయంలో యూపీఐ/కార్డు ద్వారా చెల్లింపు చేసి గదిని పొందవచ్చు. తిరుమలలో స్థలాభావం కారణంగా 7800 వసతి గదులు మాత్రమే అందుబాటులో ఉన్నందున, కుటుంబాలతో వచ్చిన భక్తులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగు తోంది. ఒంటరి అవివాహిత స్త్రీ, పురుష జంటలకు గదుల కేటాయించబడవు. వసతి గదులు లభించని భక్తుల కోసం టీటీడీ తిరుమలలో ఐదు యాత్రికుల వసతి సముదాయాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాలలో భక్తులు ఆధార్ కార్డు, ఫోన్ నంబరు నమోదు చేసి ఉచిత లాకర్లు మరియు ఇతర సౌకర్యాలను పొందవచ్చు. సీఆర్వో సమీపంలోని గోవర్ధన్ సత్రం ఎదురుగా ఉన్న ఈ సముదాయంలో 4 హాళ్లు, 1256 లాకర్లు ఉన్నాయి. ప్రస్తుతం పునరుద్ధరణ పనుల కారణంగా 870 లాకర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అన్నప్రసాదం సౌకర్యం కలదు. బాలాజీ బస్ స్టాండ్ ఎదురుగా



ఉన్న ఈ సముదాయంలో 12 హాళ్లు, 3300 లాకర్లు ఉన్నాయి. అన్నప్రసాదం, తలనీలాలు సమర్పించే సదుపాయం, ప్రథమ చికిత్స కేంద్రం, విశ్రాంతి సదుపాయాలు కల్పించబడ్డాయి. జీఎన్సీ టోల్ గేట్ నుండి రాంభగీచా బస్ స్టాండ్కు వెళ్లే ఔటర్ రింగ్ రోడ్డులో ఉన్న ఈ భవనంలో 9 హాళ్లు, 1420 లాకర్లు ఉన్నాయి. తలనీలాలు సమర్పించే సదుపాయం మరియు విశ్రాంతి సౌకర్యం కలదు. బాలాజీ బస్ స్టాండ్ లోపల ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో 3 హాళ్లు, 960 లాకర్లు ఉన్నాయి. ఇక్కడ విశ్రాంతి, లాకర్, స్నాన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. భక్తుల సౌకర్యార్థం నిర్మించిన ఈ ఆధునిక సముదాయాన్ని 2025 సెప్టెంబర్ 25న భారత ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. సి ఆర్ ఓ వెనుక భాగంలో ఉన్న ఈ భవనంలో 16 హాళ్లు, 2400 లాకర్లు ఉన్నాయి. అన్నప్రసాదం, తలనీలాలు సమర్పణ, ప్రథమ చికిత్స, విశ్రాంతి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.

**భక్తులకు అందుబాటులో 9336 ఉచిత లాకర్లు**

తిరుమలలోని ఈ ఐదు యాత్రికుల వసతి సముదాయాలన్నింటిలో కలిపి మొత్తం 9336 లాకర్లు భక్తులకు ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. భక్తులు తమ విలువైన వస్తువులను భద్రపరచుకోవడానికి వీటిని వినియోగించుకోవచ్చు. ఈ కేంద్రాలలో ఉచిత వేడి నీటి స్నాన గదులు, మరుగుదొడ్లు, చాపలు, రగ్గులు, అన్నప్రసాదం, తలనీలాలు సమర్పించే సదుపాయం, ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశారు. దర్శనం అనంతరం భక్తులు లాకర్లు ఖాళీ చేసి, తీసుకున్న చాపలు, రగ్గులు తిరిగి అప్పగించాల్సి ఉంటుంది.భక్తులు ఈ యాత్రికుల వసతి సముదాయాలను వినియోగించుకుని స్వామివారి దర్శనాన్ని సుఖసంతోషాలతో పూర్తి చేసుకోవాలని, దర్శనం అనంతరం గదులు లాకర్లు వెంటనే ఖాళీ చేసి ఇతర భక్తులకు కూడా అవకాశం కల్పించాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.



# రేణిగుంట సమీపంలో లారీ దగ్ధం



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 8 :** రేణిగుంట శ్రీకాళహస్తి రహదారి ప్రధాన రహదారిలో శుక్రవారం రాత్రి లారీ దగ్ధమైంది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలం చేరుకొని అగ్నిమాపక సిబ్బందితో లారీ మంటలను ఆర్పీ వేశారు. సుమారు రాత్రి 8 గంటల సమయంలో రేణిగుంట మండలం, రామకృష్ణాపురం సర్కిల్ వద్ద రేణిగుంట – కోడూరు రోడ్డుపై లారీకి అకస్మాత్తుగా మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న రేణిగుంట పోలీసు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ సిబ్బంది సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని రేణిగుంట అర్బన్ పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్ ఖాజా హుస్సేన్ తెలిపిన వివరాల ప్రకారం, తాను తమిళనాడు రాష్ట్రం చెన్నై నుండి కోడూరు వైపు లారీతో వెళ్తుండగా రామకృష్ణాపురం సర్కిల్ సమీపానికి రాగానే లారీ కుడివైపు ముందు టైరు అకస్మాత్తుగా పేలడంతో మంటలు వ్యాపించాయని, వెంటనే వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి కిందకు దిగేసరికి మంటలు పూర్తిగా వ్యాపించాయని తెలిపాడు. ప్రమాదం కారణంగా రహదారిపై వాహన రాకపోకలకు అంతరాయం కలగకుండా రేణిగుంట ఎస్సై కె. ధర్మారెడ్డి తమ సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌ను సమన్వయం చేసి పరిస్థితిని అదుపులో ఉంచారు.

# అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలి

**- తంబళ్లపల్లి ప్రభుత్వాసుపత్రిలో అగ్ని ప్రమాదాలను ఎదుర్కోవడంపై మాక్ డ్రిల్**



**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, మే 08:** వేసవిలో అగ్ని ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండి, నివారణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలని ములకలచెరువు అగ్ని మాపక శాఖ అధికారి వీరభద్ర రెడ్డి అ ాగ్రత్తలు, ప్రమాదాల్లో చిక్కుకున్నప్పుడు బయటపడే విధానంపై అవగాహన కల్పించి ఫైర్ ఎగ్జింటర్లు ఉపయోగించే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఆసుపత్రిలో అకస్మాత్తుగా



మంటలు చెలరేగితే రోగులను సురక్షితంగా బయటకు తీసుకురావడం, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో వివరించారు. మంటలను ప్రాథమిక దశలోనే ఎలా అదుపుచేయాలో ప్రయోగాత్మకంగా మాక్ డ్రిల్ చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో అగ్ని మాపక సిబ్బంది కిరణ్ కుమార్, మనోజ్ కుమార్, మెడికల్ ఆఫీసర్ తేజశ్విని, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య మేళా ద్వారా అనీమియాపై అవగాహన

**కేవీబీపురం – ఆంధ్రనాడు, మే 8:** మండలంలోని కోవనూరు అంగన్వాడీ కేంద్రంలో



కిశోరీ వికాసము వేసవి సెలవుల శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాలికల్లో ఆరోగ్య చైతన్యం, వ్యక్తిత్వ వికాసం, పోషకాహారంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఐసీడీస్ సూపర్వైజర్లు కె. రాజేశ్వరి, బి. కల్పలత మాట్లాడుతూ మే 1వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ప్రతి మంగళ, శుక్రవారం అంగన్వాడీ కేంద్రాల్లో కిశోరీ వికాసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆరోగ్య మేళాలో డాక్టర్ జగదీష్ కిశోరీ బాలికలకు అనీమియా వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, పోషకాహారం అవసరం గురించి వివరించారు. ముఖ్యంగా యువతులు ఐరన్ పదార్థాలు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవాలని, ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ గవాస్కర్, అంగన్వాడీ కార్యకర్తలు సుగుణ, ఈశ్వరమ్మ, కిశోరీ బాలికలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉర్దూ ఒక మధురమైన భాష.. మన సంస్కృతిలో భాగం: ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి


**నగిరిపల్లి, పీలేరు – ఆంధ్రనాడు, మే 8:** ఉర్దూ భాష మధురమైనదిగా, గొప్ప సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఉర్దూ భాషను నేర్చుకోవడం ద్వారా యువతకు కొత్త అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో, చైర్మన్ మహమ్మద్ ఫరూఖ్ షుబ్లీ సారథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న “ఆవో ఉర్దూ సీఖే” ఉచిత కోచింగ్ కార్యక్రమం శుక్రవారం నగిరిపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్ పఠాన్ ఖాదర్ ఖాన్ “ఆవో ఉర్దూ సీఖే – రండి ఉర్దూ నేర్చుకుందాం” పుస్తకాన్ని ఆవిష్కరించి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, “ఉర్దూ కేవలం ఒక భాష మాత్రమే కాదు.. అది గొప్ప సంస్కృతి, సాహిత్యం, సామరస్యానికి ప్రతీక. కవిత్వం, గజల్స్, షాయిరీలతో మన హృదయాలను హత్తుకునే మధురమైన భాష ఉర్దూ. ఈ భాషను పరిరక్షించడం మనందరి బాధ్యత. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు విద్యార్థులకు కొత్త అవకాశాలు కల్పించడమే కాకుండా, మన సంప్రదాయాల పరిరక్షణకు కూడా దోహదపడతాయి” అని అన్నారు. “ఆవో ఉర్దూ సీఖే” వంటి కార్యక్రమాలు గ్రామీణ స్థాయికి ఉర్దూ భాషను తీసుకెళ్లి యువతలో కొత్త చైతన్యాన్ని నింపుతున్నాయని ఎమ్మెల్యే అభినందించారు. ఉర్దూ నేర్చుకునే ప్రతి ఒక్కరికీ తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి కలికిరి మండల అధ్యక్షులు షాబుద్దీన్, మండల మైనార్టీ అధ్యక్షులు మున్వర్, ఉపాధ్యక్షులు ఖాదర్ భాష, ఇమామ్ సాహెబ్, అన్సర్ భాష, జర్నలిస్టు పఠాన్ జాకీర్, యూనిస్, ముజీబ్, షౌకత్, ముక్తార్ తదితరులు, మైనార్టీ నాయకులు, ఉర్దూ ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# పీలేరు నియోజకవర్గ ఆలయాల అభివృద్ధికి రూ.6.78 కోట్ల నిధులు

**- ఎమ్మెల్యే నల్లారి చొరవకు దేవాదాయ శాఖ కృతజ్ఞతలు**

**పీలేరు – ఆంధ్రనాడు, మే 8:** నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి చొరవతో పీలేరు నియోజకవర్గంలోని ప్రాచీన ఆలయాల పునరుద్ధరణకు సర్వ శ్రేయోనిధుల నుంచి రూ. 6,78,50,000 నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా నగిరిపల్లి లోని ఎమ్మెల్యే కార్యాలయంలో పీలేరు దేవాదాయ శాఖ ఈవో మంజుల ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. మంజూరైన నిధుల వివరాలు ఇలా ఉన్నాయి: పీలేరు మండలం దొడ్డిపల్లి శ్రీ చెన్నకేశ్వర స్వామి ఆలయం – రూ.63.50 లక్షలు అన్నంగివారిపల్లె శ్రీ మాతమ్మ ఆలయం – రూ.75 లక్షలు వాయల్పాడు మండలం చింతపర్తి గుంటి వీర గంగమ్మ ఆలయం – రూ.1 కోటి మంజూరు శ్రీ సోమేశ్వర స్వామి ఆలయం – రూ.1 కోటి గుర్రంకొండ మండలం చెర్లోపల్లి రెడ్డమ్మ దేవత ఆలయం – రూ.2.20 కోట్లు కలికిరి మండలం గుండ్లూరు శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం – రూ.1.20 కోట్లు ఈ సందర్భంగా ఈవో మంజుల మాట్లాడుతూ, “నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని భారీగా నిధులు మంజూరు చేయించారు. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ఆలయాలు ఇప్పుడు నూతన శోభ సంతరించుకోనున్నాయి” అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, “మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన ఆలయాల అభివృద్ధి మనందరి బాధ్యత. ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలోని అన్ని ఆలయాలను దశలవారీగా అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# హిమాలయన్ అడ్వెంచర్ క్యాంప్‌లో ప్రతిభ చాటిన మిట్స్ ఎన్‌సీసీ క్యాడెట్లు

**కురబలకోట – ఆంధ్రనాడు, మే 08:** మదనపల్లి సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ కు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు గంగరపు జ్యోతీశ్వర్, రామిరెడ్డి లక్ష్మణ్, ఎం. భార్గవి భారతీయ హిమాలయన్ సెంటర్ ఫర్ అడ్వెంచర్ అండ్ ఎకో–టూరిజం నిర్వహించిన జాతీయ స్థాయి అడ్వెంచర్ మరియు మౌంటెనీరింగ్ క్యాంప్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. సిక్కింలోని చెమ్చేలో ఉన్న ఇండియన్ హిమాలయన్ సెంటర్ ఫర్ అడ్వెంచర్ అండ్ ఎకో–టూరిజం పర్వతారోహణ శిక్షణ, పర్యావరణ పరిరక్షణకు అంకితమైన ప్రతిష్టాత్మక జాతీయ సంస్థ అని ఆయన పేర్కొన్నారు. ఇండియన్ మౌంటెనీరింగ్ ఫౌండేషన్ గుర్తింపు పొందిన ఈ సంస్థ పర్వతారోహణ, రాక్ క్రాఫ్ట్, ఐస్ క్రాఫ్ట్ వంటి విభాగాల్లో ఉన్నత స్థాయి శిక్షణ అందిస్తోందన్నారు. ఈ శిక్షణలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 15 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొనగా, అందులో మిట్స్ విద్యార్థులు చోటు దక్కించుకోవడం గర్వకారణమని తెలిపారు. సుమారు 6,582 అడుగుల ఎత్తులోని హిమాలయ ప్రాంతాల్లో ట్రెక్కింగ్, రివర్ రాఫ్టింగ్, పారాగ్లైడింగ్ వంటి సాహస కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకున్నారని వివరించారు. పర్వతారోహణ, రాక్ క్లైంబింగ్, ట్రెక్కింగ్ వంటి కఠిన శిక్షణల ద్వారా ప్రకృతి సవాళ్లను ఎదుర్కొంటూ జట్టు భావనతో పనిచేయడం, దేశసేవకు సిద్ధమయ్యే విలువలు అలవడతాయని పేర్కొన్నారు. ప్రతి క్యాడెట్ దేశ రక్షణకు తమ వంతు సేవ అందించాలని సూచించారు. ప్రతి ఏడాది ఎన్‌సీసీ క్యాడెట్లు యూనివర్సిటీకి మంచి పేరు తీసుకువస్తున్నారని, జాతీయ స్థాయి వేదికలపై ఇటువంటి శిక్షణల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, సాహస స్ఫూర్తి, నాయకత్వ నైపుణ్యాలు పెంపొందుతున్నాయని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి క్యాంప్ కోర్స్ డైరెక్టర్ కాజీ షెర్పా, ట్రైనింగ్ ఆఫీసర్ నకుల్ గిరి పర్యవేక్షణ వహించారు. శిక్షణ పూర్తి చేసిన క్యాడెట్లను యూనివర్సిటీ ఫౌండర్ అండ్ చాన్సలర్ డాక్టర్ ఎన్. విజయ భాస్కర్ చౌదరి, ప్రో ఛాన్సలర్ ఎన్. ద్వారకానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఎన్. నవీన్ కుమార్, 35 ఆంధ్ర బెటాలియన్ చిత్తూరు కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ మోనిష్ ఎన్.వి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పీ. లోకనాథన్ తదితరులు అభినందించారు.











## 7వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీగా గణపతి నియామకం - ఘనంగా సన్మానించిన ఆయన మిత్ర బృందం



**మదనపల్లి – ఆంధ్రనాడు, మే 8:** మదనపల్లి లోని 7వ అదనపు జిల్లా జడ్జి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా న్యాయవాది జె.గణపతి నియామకం కావడం శుభపరిణామమని ఆయన మిత్రబృందం పేర్కొంది. ప్రిన్సిపల్ సెక్రటరీ ఆఫ్ హోమ్ ఆదేశాల మేరకు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఏపీ రామకోటేశ్వరరావు నియామక ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం జన్నే సుబ్బనాయుని, ఎ.ఆంజనేయులు నాయుని, బూచుపల్లి వేమనారాయణ నాయుని, నాగార్జుననాయని, అలకం ప్రకాష్ నాయని, తదితరులు జె.గణపతిని పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదిగా సుదీర్ఘ అనుభవం కలిగిన గణపతి ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. క్లిష్టమైన కేసులను సమర్థవంతంగా నిర్వహించడంలో ఆయనకు ప్రత్యేక నైపుణ్యం ఉందని కొనియాడారు. ఇలాంటి వ్యక్తిని ఏపీపీగా నియమించడం గర్వకారణమని, న్యాయవ్యవస్థ గౌరవాన్ని మరింత పెంచేలా ఆయన సేవలందిస్తారని తెలిపారు. అలాగే భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

శనివారం 09.05.2026
తిరుపతి – చిత్తూరు
అన్నమయ్య– అనంతపురం
ఆంధ్రనాడు

## కిషోర బాలబాలికలకు 'కిషోర్ వికాసం' అవగాహన సదస్సు



**పలమనేరు, ఆంధ్రనాడు, మే 08 :** పలమనేరు ప్రాజెక్ట్ పరిధిలోని రూరల్ సెక్టార్, మండిపేట సచివాలయంలో 'కిషోర్ వికాసం' వేసవి శిక్షణా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఐసిడియస్ సిడిపిఓ ఉమారాణి ఆదేశాల మేరకు, సూపర్వైజర్ నజ్మా ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మూడవ సెషన్‌లో కిషోర బాలికలకు రక్తహీనత వల్ల కలిగే నష్టాలు, ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత మరియు పౌష్టికాహారం తీసుకోవడం ప్రాధాన్యత గురించి సూపర్వైజర్ నజ్మా వివరించారు. ఈ సందర్భంగా సమాజంలో ఆడపిల్లల పట్ల గౌరవంగా ఎలా మెలగాలో, పొక్సో చట్టం గురించి, చదువు యొక్క ఆవశ్యకతను వివరించారు. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించాలని, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని అవగాహన కల్పించారు. కిషోర్ వికాసం కార్యక్రమంలో భాగంగా మే 1వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు ప్రతి వారం మంగళవారం మరియు శుక్రవారం అన్ని అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఈ సెషన్లు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిషోర బాలబాలికలతో పాటు అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



**పలమనేరు, ఆంధ్రనాడు, మే 08 :** పలమనేరు సబ్ స్టేషన్ లో విద్యుత్ 33కేవీ లైన్స్ లో మరమ్మతులు కారణంగా నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆపరేషన్స్ ఎ.డి.ఈ జీవన్ కుమార్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా పలమనేరు అర్బన్, పలమనేరు రూరల్, గంగవరం, వి. కోట మరియు బైరెడ్డిపల్లి మండలంలో ఉదయం 9 తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం ఒక గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

## రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గంగమ్మకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు



**పలమనేరు, ఆంధ్రనాడు, మే 08:** పట్టణంలో వైభవంగా జరుగుతున్న శ్రీశ్రీశ్రీ తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా రెడ్డి సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఆర్ ఒ బి అతిథి గృహం నుండి మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనలు, బళ్లారి డ్రమ్స్, డిజె సౌండ్ సిస్టమ్స్, బాణాసంచా వేడుకల నడుమ భారీ ఊరేగింపుగా గంగమ్మ గుడిని చేరుకొని అమ్మవారికి నిష్టగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే భక్తుల కోసం ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిషోర్ గౌడ్, రంగనాథ్, జయరాం రెడ్డి, వెంకటముని రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ఇల్లూరు అమర్నాథ్ రెడ్డి, పల్లెరుచులు అమర్నాదరెడ్డి, నరేష్ రెడ్డి, మల్లేశ్వర రెడ్డి, కృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మీడియా కోఆర్డినేట్ సభ్యులుగా శ్రీధర్ వర్మ

### - నెల్లూరు మహానాడుకు శ్రీధర్ వర్మకు అవకాశం



**తిరుపతి మే 8 (ఆంధ్రనాడు):** ఈ నెల 26, 27, 28 తేదీల్లో నెల్లూరులో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు పండుగకు మీడియా కమిటీ సభ్యుల్లో శ్రీధర్ వర్మను ఎంపిక చేయడం జరిగింది. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌కు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ వర్మ మాట్లాడుతూ తనపై బాధ్యతతో నెల్లూ రులో జరుగునున్న మహానాడు పండుగకు మీడియా కమిటీ సభ్యులుగా ఎంపిక చేయ డం పట్ల పార్టీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ పార్టీ కోసం తాను మరింత బాధ్యతగా పని చేస్తానని తెలియజేశారు. ఈయన ఎంపిక పట్ల పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు హ ర్షం వ్యక్తం చేశారు.

# పట్టణాభివృద్ధి పనులను వేగవంతం చేయండి

**- జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ ఆదేశం**



**మదనపల్లి – ఆంధ్రనాడు, మే 08:** మదనపల్లి పట్టణంలో త్రాగునీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ పనులు, పారిశుధ్య నిర్వహణ, పట్టణ కూడళ్ల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, ప్రాపర్టీ టాక్స్ మరియు వాటర్ టాక్స్ వసూళ్లపై సంబంధిత అధికారులతో శుక్రవారం ఉదయం మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని మదనపల్లి పట్టణ ప్రత్యేక అధికారి మరియు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని ప్రస్తుత జనాభా, త్రాగునీటి అవసరాలు, పనిచేస్తున్న బోర్ వెల్లు, చేతిపంపులు, నీటి ట్యాంకుల వివరాలు, వేసవి కాలంలో త్రాగునీటి సమస్యల నివారణకు చేపడుతున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రామారావు కాలనీ, రెడ్డీస్ కాలనీ, మారుతి నగర్, వీక్లీ మార్కెట్ ప్రాంతాల్లో 14 బోర్లు ఎండిపోవడంతో ప్రత్యామ్నాయంగా 7 కొత్త బోర్లు తవ్వి వినియోగంలోకి తీసుకువచ్చినట్లు అధికారులు వివరించారు. అదనంగా మరికొన్ని బోర్ల కోసం చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. నీటి సమస్య ఉన్న ప్రాంతాలకు మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీరు అందించడంతోపాటు నీటి నాణ్యత పరీక్షలను తరచూ నిర్వహించి ప్రజలకు నాణ్యమైన నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, పారిశుధ్య కార్మికులు ప్రతిరోజు విధుల్లో హాజరయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. రోడ్లు, కాలువలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విధులకు అనధికారికంగా గైర్హాజరయ్యే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మున్సిపల్ పార్కులు ఆక్రమణలకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని, పట్టణంలోని ముఖ్య కూడళ్లలో సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు ప్రాపర్టీ టాక్స్, వాటర్ టాక్స్ వసూళ్లను సమర్థవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి బకాయిల వివరాలు తెలియజేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించాలని, పారదర్శకంగా పన్నుల వసూళ్లు చేపట్టాలని సూచించారు. టాక్స్ చెల్లింపుల ద్వారా రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్య సేవలు మెరుగుపడతాయని ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రతి వార్డు వారీగా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి ప్రాపర్టీ టాక్స్, వాటర్ టాక్స్ వసూళ్లను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ క మిషనర్ ప్రమీల, ఇంజనీరింగ్ డిఈ శ్రావణి, పబ్లిక్ హెల్త్, ప్రాపర్టీ టాక్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడల్లో యువత రాణించాలి

**- సమ్మర్ కోచింగ్ క్యాంప్-2026కు క్రీడా సామగ్రి పంపిణీ**
**- ఎమ్మెల్యే షాజహాన్ బాషా, జేసీ శివ్ నారాయణ శర్మ**



**మదనపల్లి – ఆంధ్రనాడు, మే 8:** యువత క్రీడల్లో తమ ప్రతిభను వెలికితీసుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ ఆకాంక్షించారు. అన్నమయ్య జిల్లా క్రీడా అభివృద్ధి సంస్థ (డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్–2026కు సంబంధించిన క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమం శుక్రవారం మదనపల్లె జిల్లా కలెక్టరేట్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా, జేసీ శివ్ నారాయణ శర్మ ముఖ్య అతిథులుగా హాజరై క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సమ్మర్ కోచింగ్ క్యాంపుల ద్వారా క్రీడాకారులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కోచ్‌లు క్రీడాకారుల ప్రతిభను గుర్తించి మెరుగైన శిక్షణ అందించాలని కోరారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాటాడుతూ యువత మొబైల్, టీవీలకు పరిమితం కాకుండా శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకునేలా క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, జావెలిన్ త్రో తదితర క్రీడలకు అవసరమైన ఫిట్నెస్ సామగ్రిని జిల్లా క్రీడా అభివృద్ధి సంస్థ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 31 వేల మంది క్రీడాకారులు క్రీడా యాప్‌లో నమోదు చేసుకోగా, అన్నమయ్య జిల్లాలోనే 1,500 మందికిపైగా నమోదు కావడం అభినందనీయమని డీఎస్‌ఏ అధికారి జి. చంద్రశేఖర్ తెలిపారు. జిల్లాలో 50 సమ్మర్ కోచింగ్ క్యాంపులు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్ ఇంచార్జులు, కోచ్‌లు, క్రీడాకారులు, క్రీడాశాఖ సిబ్బంది పాల్గొన్నారు. శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి, చైర్మన్ నవీన్ చౌదరి తదితరులు హాజరయ్యారు.

## బ్యాంకుల్లో ఖాళీగా ఉన్నా మెసెంజర్, గార్డ్స్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి


**- ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి**
**- ఈ నెల 26, 27 తేదీలలో దేశవ్యాప్తంగా ఉద్యోగులంతా సమ్మెబాట**
**- తిరుపతిలో ప్లకార్డులతో నిరసన చేసిన ఉద్యోగులు**




**తిరుపతి, మే 8 (ఆంధ్రనాడు):** దేశవ్యాప్తంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల్లో దీర్ఘకాలికంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఆల్ ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కామ్రేడ్ వి వి ప్రసాద్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 26 27 తేదీలలో చేపట్టనున్న సమ్మెకు సంఘీభావంగా శుక్రవారం తిరుపతిలో ఎస్బిఐ ఉద్యోగులు పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ఉన్న బ్యాంకు వద్ద ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్బిఐ స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ తిరుపతి మాడ్యూల్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కామ్రేడ్ వి వి ప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉందని గతంలో పలుమార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పరిష్కరించిన దాఖలాలు లేవన్నారు. బ్యాంకు కార్యాచరణ సమగ్రత దీర్ఘకాలికంగా పరిష్కారం కాని సమస్యలు నేపథ్యంలో ఈ నెల 26, 27 తేదీలలో దేశవ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నట్లు చెప్పారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాజమాన్యంతో డిమాండ్ల పరిష్కారం కోసం ఫెడరేషన్ నాయకులు పలుమార్లు ప్రయత్నించినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదు అన్నారు. బ్యాంకుల యొక్క భద్రత సేవా ప్రమాణాలను నిర్వహించడానికి ఖాళీగా ఉన్న మెసెంజర్లు, ఆర్ముడు గార్డులు, క్లరికల్ సిబ్బందిని నిర్మించాలని ఇప్పటికే పలుమార్లు అభ్యర్థించామన్నారు. అనంతరం ఎస్బిఐ స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ తిరుపతి మాడ్యూల్ ఉపాధ్యక్షులు గిరిధర్ మాట్లాడుతూ ఉద్యోగుల పెన్షన్, ఎన్ పి ఎస్ సంస్కరణలు, పండు మేనేజర్లను మార్చుకునే అవకాశాన్ని ఉద్యోగులకు కల్పించాలన్నారు. 2019 నుండి నియమించబడిన ఉద్యోగుల వ్యక్తిగత సామాజిక ఇబ్బందులను తగ్గించడానికి ఇంటర్ సర్కిల్ బదిలీలను అమలు చేయాలన్నారు. కోర్ బ్యాంకింగ్ విధులను అవుట్సోర్సింగ్ చేయడానికి వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. థర్డ్ పార్టీ ఉత్పత్తుల బలవంతపు అమ్మకాలను ఆపాలన్నారు. ఎనిమిదవ స్టాగ్నేషన్ ఇంక్రిమెంట్ ను మంజూరు చేయాలని, మెడికల్ రీయంబర్స్మెంట్లను మరింత పెంచాలని విజ్ఞప్తి చేశారు. కెరీర్ ప్రోగ్రెషన్ స్కీమును పునరుద్ధరించాలని, బ్యాంకు బోర్డులో వర్క్ మెన్ ఎంప్లాయిస్ డైరెక్టర్ ను ట్రస్టీని నియమించాలన్నారు. దేశవ్యాప్తంగా ఉద్యోగుల హక్కులను ఖాతాదారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సమ్మెకు వెళుతున్నట్లు చెప్పారు. సిబ్బంది కొరత సేవ నిబంధనల క్షీణత ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ వ్యవస్థకే ముప్పుగా మారిందన్నారు. ఇప్పటికైనా బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలగకుండా ఉండాలంటే యాజమాన్యం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా ఎస్బిఐ స్టాఫ్ ఫెడరేషన్ డిమాండ్ చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగ యూనియన్ నాయకులు డి జి ఎస్ ప్రసాద్, ఏజిఎస్ రాజు, కోశాధికారి శ్రీకాంత్, తిరుపతిలోని పలు ఎస్బిఐ బ్యాంకు శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

## హార్సిలీహిల్స్ లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**- అధికారులకు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ ఆదేశం**



**మదనపల్లి – ఆంధ్రనాడు, మే 08:** ప్రముఖ పర్యాటక కేంద్రం అయిన హార్సిలీహిల్స్ నందు చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మదనపల్లిలోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణితో కలిసి ఆర్ అండ్ బి, పర్యాటక శాఖ, డిపిఓ, విద్యుత్తు శాఖ, కొత్తకోట ఎంపీడీవో, ఎమ్మార్వో తదితర శాఖలతో సమావేశంలో నిర్వహించి హార్సిలీహిల్స్ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటకులను ఆకర్షించే విధంగా మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గాలిబండ ప్రాంతంలో గాజు పెంకులు, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని, ఆ ప్రాంతంలో డస్ట్ బిన్లను ఏర్పాటు చేయాలని, ప్లాస్టిక్ వాడకంపై నిషేధం బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్లు, పార్కుల అభివృద్ధి, తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాలు, పచ్చదనం పెంపు, వీక్షణ స్థలాల అభివృద్ధి వంటి పనులపై అధికారులతో చర్చించారు. హార్సిలీహిల్స్ కు వచ్చే పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించడం ద్వారా పర్యాటక రంగ అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని, పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో సంబంధిత శాఖల సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో సంబంధిత శాఖల డిపిఓ రాధమ్మ, పర్యాటకశాఖ అధికారి నాగభూషణం, విద్యుత్, ఆర్ అండ్‌బి, బి.కొత్తకోట ఎమ్మార్వో, మండల అభివృద్ధి అధికారి కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మె హెచ్చరిక జారీ చేసిన పంచాయతీ కార్మికులు

## - రెండు నెలలుగా జీతాలు లేవు



**పీలేరు – ఆంధ్రనాడు, మే 8 :** రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, స్వచ్ఛభారత్ కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు వెంటనే విడుదల చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెకు దిగుతామని ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ధనాసి వెంకట్రామయ్య హెచ్చరించారు. శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసిన ఆయన మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు ఇప్పటివరకు ఇవ్వలేదు. రాత్రింబవళ్లు చాకిరీ చేయించుకుంటూ జీతాలు అడిగితే ప్రభుత్వం నుంచి రావాలని అధికారులు చేతులెత్తేస్తున్నారు.

జిల్లా అధికారులను అడిగితే 'ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం, ప్రభుత్వం దగ్గర సమస్య ఉంది' అని చెబుతున్నారు. అసలే చాలీచాలని జీతాలు, అవి కూడా రాకపోవడంతో కార్మికులు వడ్డీలకు తెచ్చి బతుకుతున్నారు. వడ్డీలు కట్టలేక, ఇంటి గడవక నానా ఇబ్బందులు పడుతున్నాం అని ఆవేదన వ్యక్తం చేశారు. మేమంతా బడుగు, బలహీన వర్గాలకు చెందిన వాళ్లం. మా సమస్యలను ఏ జిల్లా అధికారి పట్టించుకోవడం లేదు. జిల్లా డీపీవోలకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదు. కార్మికుల దగ్గర వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారు అని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందనే ఆశతో ఉన్నామని, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించి గ్రామ పంచాయతీ కార్మికులందరికీ పెండింగ్ వేతనాలు విడుదల చేయించాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులందరం విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు.

# కురవ, కురుబ సంఘం నూతన మండల కమిటీ నియామకం

## - సంఘ బలోపేతం, యువతకు రాజకీయ ప్రాధాన్యత పై చర్చ



**కలకడ, పీలేరు–ఆంధ్రనాడు, మే 8**

కలకడ మండల కేంద్రంలో కురవ/కురుబ సంఘం నూతన మండల కమిటీ నియామక సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కలకడ మాజీ ఎక్స్ఎంపీపీ కాంతారావు, గౌని లక్ష్మన్న, కోటకొండ రఘునాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కులబాంధవులు, యువకులు, సంఘ నాయకులు హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలో సంఘ ఐక్యత, సామాజిక అభివృద్ధి, యువత భవిష్యత్‌పై నాయకులు విస్తృతంగా చర్చించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కురవ/కురుబ సమాజం రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు సంఘటిత శక్తి ఎంతో అవసరమని, సంఘ బలోపేతంతోనే హక్కులు సాధించగలమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ కురుబ కులస్తులు అన్ని రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొని నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర కమిటీ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

అనంతరం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా ఆవుల కృష్ణమూర్తి, కార్యదర్శిగా కెంగన బాలాజీ, యువజన సంఘం అధ్యక్షుడిగా బడుకూరి గురునాథ్, ఉపాధ్యక్షుడిగా బండి విజేందర్‌ను నియమించారు. అలాగే వివిధ హోదాల్లో కమిటీ సభ్యులను ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించారు. నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని, కులబాంధవుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో సంఘాన్ని విస్తరించి యువతను సంఘ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జనార్దన్ గౌడ్, మాజీ సర్పంచ్ కమల్నాథ్, తిమ్మయ్య, రెడ్డప్ప, సిద్దయ్యతో పాటు పలువురు కుల పెద్దలు, విద్యావంతులు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగి సంఘ ఐక్యతకు నాంది పలికింది.

# మామండూరు తుడా లేఅవుట్ అభివృద్ధి పనులపై కీలక సమీక్ష



**తిరుపతి– ఆంధ్రనాడు, మే 8:** తుడా పరిధిలోని మామండూరు వద్ద ఉన్న తుడా లేఅవుట్‌ను తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ ఆర్. గోవిందరావు తో కలిసి శుక్రవారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో లేఅవుట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకోవడంతో పాటు, పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటును వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు లేఅవుట్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తుడా లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సాంకేతిక కారణాల వల్ల నిలిచిపోయిన పనులను తక్షణమే సమీక్షించి, అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని వైస్ ఛైర్మన్ గోవిందరావు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ డా యన్ వి శ్రీకాంత్ బాబు సీపిఓ దేవికుమారి, ఏపీఓ లు, జెపిఓలు, తుడా ప్లానింగ్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం




**పుత్తూరు– ఆంధ్రనాడు, మే 8:** పుత్తూరు మండలం నేషనూర్ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం కిషోరి వికాసం కార్యక్రమం పై బాలికలకు అవగాహన కల్పించడం జరిగింది. ఐసిడిఎస్ సూపర్వైజర్ డి శ్రీదేవి, మండల హెల్త్ ఆఫీసర్ మార్టిన్, కీర్తి, టాటా ట్రస్ట్ బి సంతోష్, కిషోరి బాలికలకు పోషణ,ఆరోగ్యం,విద్య పై అవగాహన లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం, బాల్య వివాహాల నిరోధం బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, రక్తహీనత,పరిశుభ్రత మరియు జీవన నైపుణ్యాల వంటి వివిధ అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది పిల్లలు స్క్రీనింగ్ దూరంగా ఉంటూ ఇండోర్ ఔట్డోర్ ఆటలు పై శ్రద్ధ పెట్టి శారీరకంగానూ మానసికంగానూ సమస్యలు లేకుండా చేసుకోవడానికి ఉత్సాహం కలుగుతుంది అని తెలియజేశారు. మన లక్ష్యం మనం చేరుకోవడానికి సరైన వయసు కనుక మంచి ఆలోచనలతో ముందుకు అడుగు వేద్దాం మనకి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మనం భరోసా గా ఉండాలి అని తెలియజేశారు ఇందులో నేషనూర్ గ్రామ ప్రజలు మరియు అంగన్వాడీ టీచర్ ధనమ్మ సుమతి ఆశా వర్కర్ పాల్గొన్నారు




# కిషోరి వికాసం - రక్తహీనతపై అవగాహన





**వడమాలపేట–ఆంధ్రనాడు, మే 8**

వడమాలపేట మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 11 నుండి 18 సంవత్సరాల వయసు గల బాలికలకు వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మే నెల మొదటి తారీకు నుండి జూన్ 12 తారీకు వరకు జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళవారం శుక్రవారం ప్రతి అంగన్వాడీ కేంద్రాలలో అవగాహన కార్యక్రమాలు - జీవన నైపుణ్యాలు, స్వీయ అవగాహన, అనీమియా పై అవగాహన, అవసరాలు,సవాళ్లు, ఆరోగ్యము హెచ్ఐవి, చట్టాలపై అవగాహన, ఆర్థిక నిర్వహణ, శారీరక వ్యాయామం, విద్య మరియు కెరీర్ మార్గదర్శకాలు, స్మార్ట్ ఫోన్ వినియోగం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండడం లాంటి విషయాలపై అవగాహన కార్య క్రమా లు నిర్వహించడం జరుగుతున్నది. ఈ కార్య క్రమంలో భాగంగా వడమాలపేట మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు కిశోర బాలికలకు రక్తహీనత పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి జిల్లా మిషన్ కోఆర్డినేటర్ శ్రీమతి కృష్ణమంజరి మరియు వడమాల పేట మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెన్నెల సాహితి ఆధ్వర్యంలో పిల్లలకు రక్తహీనత పై అవగాహన కల్పించడం జరిగినది. సమాజంలో డేటా ప్రకారం 50 శాతం మంది ఆడపిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారని కావున రక్తహీనత నివారించడానికి తీసుకోవలసిన చర్యలపై మరియు రక్తహీనత అంటే ఏమిటి రక్తహీనత వలన కలిగే పరిణామాలు రక్తహీనత రాకుండా నివారణ చర్యలు పి పి టి ద్వారా ఉదాహరణలతో వివరించడం జరిగినది.

కృష్ణ మంజరి మాట్లాడుతూ రక్తహీనత నివారణకు ఎటువంటి ఆహార పదార్థాలు తినాలో కిశోర బాలికలను చిన్న గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి ఎంతవరకు అవగాహన ఉందో తెలుసుకొని రక్తహీనత నివారణకు తీసుకోవలసిన ఆహార పదార్థాల గురించి తెలియజేస్తూ కిషోర బాలికలకు ఆరోగ్యం పట్ల ఎటువంటి అనుమానాలు ఉన్నాయో వాటిని ఒక పేపర్ మీద రాయమని చెప్పి అనుమానాలను నివృత్తి చేయడం జరిగినది.

డాక్టర్ వెన్నెల మాట్లాడుతూ... కిశోర బాలికల సమస్యలకు చక్కని సమాధానాలు తెలియజేశారు కిషోర బాలికలకు మొటిమలు రావడం ప్రతి నెల పీరియడ్స్‌లో ఎదుర్కొనే సమస్యలు వాటి నివారణ మార్గాలు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీమతి గీతాంజలి మాట్లాడుతూ బడులలో మరియు కాలేజీలలో ప్రతిరోజు సరఫరా చేసే కోడిగుడ్డు రాగి జావ వేరుశెనగ చెక్కిలు, కిశోర బాలికలు తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీ ఢిల్లీ బాబు జూనియర్ లెక్చరర్లు శ్రీనివాసులు మోహన్, రవి, ఎస్ ఆర్ మంజుల, హెల్త్ సూపర్వైజర్ ఆర్ లలిత, అంగన్వాడీ టీచర్లు గంగులమ్మ, శైలజ, నాగమణి, అంగన్వాడి సహాయకురాలు చిట్టెమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.






Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P.,
Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733